PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 172 సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 12 - ఆగష్టు - 2026 , వెల రూ.5/-

## సామాన్యుడిపై ధరల భారం వద్దు

### ఎల్ నినోను అధిగమించి 15శాతం వృద్ధి సాధించాలి : సీఎం చంద్రబాబు

- ఏపీ ఆర్థిక వృద్ధిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 2025-26 రెండో త్రైమాసికంలో 10.7శాతం వృద్ధిరేటు నమోదు
- ఎల్ నినో ప్రభావం, ధరల పెరుగుదలపై సీఎం ఆందోళన
- 15 శాతం వృద్ధిరేటు సాధించాలని అధికారులకు కొత్త లక్ష్యం
- సామాన్యుడిపై ధరల భారం పడకుండా కమిటీ ఏర్పాటుకు సూచన





**నేటి శుభోదయ, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటూ సానుకూల వృద్ధిరేటుతో దూసుకెళ్తోంది. గడిచిన రెండేళ్లుగా జాతీయ సగటును మించి ప్రగతి సాధిస్తున్న ఏపీ, 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. అయితే, ఈ సానుకూల వాతావరణంలోనూ ఎల్ నినో రూపంలో పొంచివున్న ముప్పును ముందుగానే పసిగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దానిని అధిగమించి రాష్ట్రాన్ని 15 శాతం వృద్ధిరేటు పథంలో నడిపించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రణాళికా విభాగం అధికారులు సమర్పించిన జూలై నెల ఆర్థిక నివేదికపై ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రణాళికా విభాగం నివేదిక ప్రకారం, రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధి రేటు 2023-24లో 6.5 శాతం ఉండగా, 2025-26 నాటికి 9.9 శాతానికి పెరిగింది. ముఖ్యంగా వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం చొప్పున వృద్ధి సాధించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలుగా నిలిచాయి. పశుసంవర్ధక శాఖలో మాంసం, గుడ్ల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఐటీ, రవాణా, వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకున్నాయి. టెక్నాలజీ వినియోగంతో జీఎస్టీ వసూళ్లు 21 శాతం పెరిగి రూ.13,282 కోట్లకు చేరగా, రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ.2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టులు, రూ.60 వేల కోట్ల ఎంఎస్ఎంఈ పెట్టుబడులు గ్రౌండింగ్‌లో మంచి వృద్ధిని కనబరిచాయి. ఈ ఆర్థిక ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, ఎల్ నినో ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో లోటు వర్షపాతం ఉంది. కృష్ణా నదిలో ప్రవాహాలు లేక శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు నిండలేదు. గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్లించి ఆదుకున్నాం. భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయి. ఈ పరిస్థితుల్లో జీఎస్‌డీపీ పడిపోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి" అని ఆయన సూచించారు.



## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..

### ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం: మోదీ

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి 2
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

## ఏపీలో సోషల్ మీడియా కార్యక-ర్తలకు కూటమి పార్టీల హెచ్చరిక


కూటమి పార్టీల సంయుక్త ప్రకటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర

ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల సోషల్ మీడియా కార్యకర్తలకు, అభిమానులకు విజ్ఞప్తి!

ఇటీవల మన పార్టీ అభిమానులు, కార్యకర్తల ముసుగులో గొడ్డలి పార్టీ ఫేక్ అకౌంట్లు, సూడో అభిమానులుగా వ్యవహరిస్తున్న విషయం మన దృష్టికి వచ్చింది. వీరు ఒక పార్టీకి అభిమానుల్లా నటిస్తూ, మరో మిత్రపక్ష నాయకులను తీవ్రంగా విమర్శించడం, వ్యక్తిగతంగా దూషించడం లేదా వారి ప్రతిష్టకు భంగం కలిగించేలా పోస్టులు, కామెంట్లు చేస్తున్నారు.

- మిత్రపక్ష నేతలను విమర్శిస్తున్న ఫేక్ అకౌంట్లపై కూటమి దృష్టి
- వ్యక్తిగత దూషణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టీకరణ 2
- సంయమనం పాటిస్తూ.. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని సూచన

## అమరావతి రోడ్డు పనులకు హైకోర్టు పచ్చజెండా.. పిటిషన్లు కొట్టివేత

- అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు పనులకు మార్గం సుగమం
- భూసేకరణను సవాలు చేసిన రైతుల పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు
- ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రక్రియను ఆపలేమన్న న్యాయస్థానం
- ప్రభుత్వ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించిన రైతులు



**నేటి శుభోదయ, అమరావతి :** రాజధాని అమరావతిలో అత్యంత కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఈ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసింది. విస్తృత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టును నిలిపివేయలేమని స్పష్టం చేస్తూ న్యాయస్థానం .. 2

## ప్రజల ముంగిటకు కూటమి పాలన..

### 16వ రోజూ జోరుగా 'ఇంటింటికీ తెలుగుదేశం'

- 16 రోజుల్లో 47.50 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు
- ప్రతిరోజు 3 లక్షలకు పైగా కుటుంబాలతో మమేకమవుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు
- ప్రజా స్పందనతో మరింత ఉత్సాహంగా కొనసాగుతున్న 'ఇంటింటికీ తెలుగుదేశం'
- ఉత్తమ పనితీరు కనబరుస్తున్న ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలకు నారా లోకేష్ అభినందనలు 2




## నకిలీ పోలీసులతో ర్యాలీలా?

### - వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు

- పోలీసు వ్యవస్థను వైసీపీ నేతలు అవమానిస్తున్నారన్న అనిత
- క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదని వ్యాఖ్య
- వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక 2



స్వాతంత్ర్య దినోత్సవం ముందు

## ఉగ్ర ముప్పు..

### - సరిహద్దుల్లో హైఅలర్ట్!



- స్వాతంత్ర్య దినోత్సవం లక్ష్యంగా పాక్ ఐఎస్ఐ దాడులకు కుట్ర
- పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేసిన కేంద్రం
- పాక్ సరిహద్దులో బీఎస్ఎఫ్ 'ఆపరేషన్ అలర్ట్' ప్రారంభం
- బంగ్లాదేశ్ సరిహద్దు జిల్లాల్లో 40 కొత్త ఐబీ యూనిట్ల ఏర్పాటుకు నిర్ణయం

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు దేశంలో ఉగ్రవాద దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో ఉగ్రవాదులు సరిహద్దుల వద్ద లేదా దేశంలోని ఇతర ప్రాంతాల్లో దాడులకు పాల్పడవచ్చన్న సమాచారంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేస్తూ .... 2

## 'కేరళ' ఇకపై 'కేరళం'..

### - బిల్లుకు లోక్‌సభ ఆమోదం


2

కేరళ పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం

విపక్షాల నిరసనల మధ్య చర్చ లేకుండానే ఆమోదముద్ర

కేరళ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు కేంద్రం చర్యలు

## డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరగాల్సిందే..

### నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి: రోజా

- పుత్తూరులో రోజా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న రోజా
- నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని ప్రభుత్వానికి హితవు



**నేటి శుభోదయ, పుత్తూరు :** కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని, ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా డిమాండ్ చేశారు. నిరుద్యోగులను నట్టేట ముంచిన డీఎస్సీ ప్రక్రియపై సీబీఐ చేత తటస్థ విచారణ జరిపించాలని కోరుతూ నగరి నియోజకవర్గం పుత్తూరు పట్టణంలో ఆమె ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మొట్టమొదటి ఉద్యోగ నోటిఫికేషన్‌లోనే పేపర్ లీకేజీలు, అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని రోజా తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రశ్నాపత్రాన్ని తయారు చేసిన నవీన్ అనే వ్యక్తికే మొదటి ర్యాంక్ రావడమే పేపర్ లీక్ అయిందనడానికి సజీవ సాక్ష్యమని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ నిజం కాకపోతే మొదటి ర్యాంకర్ నవీన్‌కు ఉద్యోగం ఇవ్వకుండా, రెండో ర్యాంక్ నుంచి ఎందుకు నియామకాలు చేపట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు.

# ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..

## ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం: మోదీ

**మొదటిపేజీ తరువాయి..** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. ''ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం'' అని పేర్కొన్నారు. ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

# ఏపీలో సోషల్ మీడియా కార్యకర్తలకు కూటమి పార్టీల హెచ్చరిక

**మొదటిపేజీ తరువాయి..** ఆంధ్రప్రదేశ్‌లోని అధికార ఎన్డీఏ కూటమి భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు తమ సోషల్ మీడియా కార్యకర్తలకు, అభిమానులకు కీలక ఆదేశాలు జారీ చేశాయి. మిత్రపక్షాల నాయకులను గానీ, వారి కుటుంబ సభ్యులను గానీ లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలకు, విద్వేషపూరిత ప్రచారాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సంయుక్తంగా హెచ్చరించాయి. ఈ మేరకు 'ఎన్డీఏ సోషల్ మీడియా కోఆర్డినేషన్ కమిటీ' పేరుతో ఒక బహిరంగ ప్రకటనను విడుదల చేశాయి. గత కొంతకాలంగా కూటమి పార్టీల మద్దతుదారుల ముసుగులో కొన్ని నకిలీ ఖాతాలు సోషల్ మీడియాలో చురుగ్గా ఉన్నాయని, వీటి వెనుక వైసీపీ శ్రేణుల హస్తం ఉందని కూటమి నాయకత్వం గుర్తించింది. తెలుగుదేశం కార్యకర్తగా నటిస్తూ పవన్ కల్యాణ్‌పై, జనసేన అభిమాని ముసుగులో చంద్రబాబుపై విమర్శలు చేస్తూ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ప్రకటనలో వివరించారు. ఇటువంటి చర్యల వల్ల అసలైన కార్యకర్తలు ఆవేశానికి లోనై ఒకరినొకరు విమర్శించుకుంటూ, తద్వారా కూటమి ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరహా కుట్రలను తిప్పికొట్టేందుకు అసలైన కార్యకర్తలు, అభిమానులు అత్యంత సంయమనం పాటించాలని మూడు పార్టీల నాయకత్వం కోరింది. సోషల్ మీడియాలో ఏవైనా అనుమానాస్పద పోస్టులు కనిపిస్తే, వెంటనే స్పందించకుండా సంబంధిత పార్టీల సమన్వయకర్తల దృష్టికి తీసుకురావాలని సూచించింది. ఇకపై మిత్రపక్షాలపై గానీ, నాయకులపై గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత దాడులు, మితిమీరిన విమర్శలు చేయరాదని స్పష్టం చేసింది. అంతర్గత విభేదాలకు తావివ్వకుండా కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేయాలని పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యర్థులు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశాయి. ప్రభుత్వ సానుకూల నిర్ణయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని, కూటమి ఐక్యతే రాష్ట్ర ప్రగతికి మూలమని ఈ సందర్భంగా స్పష్టం చేశాయి.

# అమరావతి రోడ్డు పనులకు హైకోర్టు పచ్చజెండా.. పిటిషన్లు కొట్టివేత

**మొదటిపేజీ తరువాయి..** న్యాయస్థానం తీర్పు వెలువరించింది. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను పలువురు రైతులు హైకోర్టులో సవాలు చేశారు. అధికారులు చట్టపరమైన నిబంధనలను పాటించలేదని, కాబట్టి ఆ నోటిఫికేషన్‌ను, తత్సంబంధిత ప్రక్రియను రద్దు చేయాలని వారు తమ పిటిషన్లలో కోరారు. ప్రభుత్వ పక్షాన అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ, భూసేకరణ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతోందని కోర్టుకు వివరించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం, గతంలో తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. ఈ నేపథ్యంలో, మంగళవారం ఆ పిటిషన్లను కొట్టివేస్తూ తుది తీర్పునిచ్చింది. ప్రజా ప్రయోజనాలే అత్యంత ప్రధానమని, వాటి కోసం చేపడుతున్న పనులకు అడ్డుకట్ట వేయలేమని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. హైకోర్టు తాజా తీర్పుతో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణ పనులకు ఉన్న న్యాయపరమైన అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి.

# 'కేరళ' ఇకపై 'కేరళం'..

## - బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**మొదటిపేజీ తరువాయి..** కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా రాష్ట్రం పేరు మార్పు ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంతో, ఆయన తరపున హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల చర్యలతో పాటు ఇతర కీలక అంశాలపై అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ గందరగోళ పరిస్థితుల నడుమనే బిల్లుకు సభ ఆమోదం ముద్రవేసింది. మలయాళంలో తమ రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, అధికారికంగా కూడా అదే పేరును ఖరారు చేయాలని కేరళ శాసనసభ 2024 జూన్‌లో తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఈ ముసాయిదా బిల్లును రాష్ట్ర అసెంబ్లీకి పంపారు. 2026 జులైలో అసెంబ్లీ దీనికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ బిల్లు ఆమోదంతో రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో సవరణలు జరగనున్నాయి.

# స్వాతంత్ర్య దినోత్సవం ముందు ఉగ్ర ముప్పు..

## - సరిహద్దుల్లో హైఅలర్ట్!

**మొదటిపేజీ తరువాయి..** కీలక చర్యలు చేపట్టింది. ఆగస్టు 15న ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో భద్రతా బలగాల దృష్టి వేడుకలపై కేంద్రీకృతమై ఉంటుందని, ఇదే అదనుగా దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ భావిస్తున్నట్లు 'ఇంటెలిజెన్స్ బ్యూరో' (ఐబీ) అధికారి ఒకరు తెలిపారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే), బలూచిస్థాన్‌లో నెలకొన్న అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఐఎస్ఐ ఈ కుట్రలకు పాల్పడుతున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లోకి ఉగ్రవాదులను చొరబడేలా చేయడం, బంగ్లాదేశ్ సరిహద్దుల ద్వారా పంపడం వంటి ప్రయత్నాలు జరగవచ్చని హెచ్చరికలు జారీ అయ్యాయి. అంతేకాకుండా, భద్రత తక్కువగా ఉండే టైర్-2 నగరాలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం కూడా ఉంది. కొన్నిసార్లు భద్రతా ఏజెన్సీల దృష్టిని పక్కదారి పట్టించేందుకు ఢిల్లీ లేదా కశ్మీర్‌లో దాడులంటూ తప్పుడు సమాచారం సృష్టించి, మరోచోట దాడికి దిగే వ్యూహం కూడా ఐఎస్ఐ అనుసరించవచ్చని ఓ అధికారి వివరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో పాకిస్థాన్‌తో ఉన్న పశ్చిమ సరిహద్దులో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) 'ఆపరేషన్ అలర్ట్'ను ప్రారంభించింది. ఆగస్టు 10 నుంచి 17 వరకు కొనసాగే ఈ ఆపరేషన్‌లో భాగంగా బీఎస్ఎఫ్ సీనియర్ అధికారులు పర్యవేక్షిస్తూ, నిఘా మరియు పెట్రోలింగ్‌ను గణనీయంగా పెంచారు. మరోవైపు, బంగ్లాదేశ్ సరిహద్దులో భద్రతను పటిష్టం చేసేందుకు పశ్చిమ బెంగాల్‌లోని సరిహద్దు జిల్లాల్లో సుమారు 40 'సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరో' (ఎస్ఐబీ) యూనిట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ సరిహద్దు అత్యంత సున్నితమైనది కావడంతో శాశ్వత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి చొరబాట్లు, స్మగ్లింగ్ వంటి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు అడ్డుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

# ప్రజల ముంగిటకు కూటమి పాలన..

## 16వ రోజూ జోరుగా 'ఇంటింటికీ తెలుగుదేశం'

**మొదటిపేజీ తరువాయి..** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా ప్రజల వద్దకు తీసుకెళ్లే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న 'ఇంటింటికీ తెలుగుదేశం – 2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం 16వ రోజూ రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహభరితంగా కొనసాగింది. ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలుస్తూ, ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తున్న పార్టీ శ్రేణులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. 16వ రోజున రాష్ట్రవ్యాప్తంగా 3.25 లక్షల ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన నాటి నుండి ఇప్పటివరకు 16 రోజుల్లో మొత్తం 47.50 లక్షల గృహాలను టీడీపీ శ్రేణులు సందర్శించినట్లయింది. ప్రతి రోజూ మూడు లక్షలకు పైగా కుటుంబాలను కలుస్తూ పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, రైతు సంక్షేమం తదితర కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తున్నారు. 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా స్వచ్ఛందంగా, ఉత్సాహంగా భాగస్వాములవుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. కార్యక్రమ నిర్వహణలో చురుగ్గా ముందంజలో ఉన్న నియోజకవర్గాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ఉత్తమ పనితీరు కనబరుస్తున్న ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను యువనేత అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని వారికి సూచించారు.

# నకిలీ పోలీసులతో ర్యాలీలా?: వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు




**మొదటిపేజీ తరువాయి..** నకిలీ పోలీసులతో ర్యాలీలు నిర్వహిస్తూ వైసీపీ నాయకులు రాష్ట్ర పోలీసు వ్యవస్థను తీవ్రంగా అవమానిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ నేతలు ఇలాంటి దిగజారుడు చర్యలకు ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు నకిలీ పోలీసుల ముసుగులో ర్యాలీలు చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించిన ఆమె, ముసుగులు వేసుకుని క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదని తేల్చి చెప్పారు. పోలీసు వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను దెబ్బతీసే ఏ ఒక్క చర్యను కూడా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనలో ర్యాలీలో పాల్గొన్న నకిలీ పోలీసులతో పాటు, వారి వెనకుండి నడిపించిన అసలు వైసీపీ సూత్రధారులపైనా చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

# భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం..

## మార్చడం ఎవరితరం కాదు : కేంద్రం

- ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరన్న విదేశాంగ శాఖ
- 27 ప్రాంతాలకు భారత పేర్లపై చైనా అభ్యంతరం
- సరిహద్దులో శాంతి అత్యంత కీలకమన్న భారత్
- ఆగస్టు 6న ఎల్ఏసీ పరిస్థితిపై చర్చలు
- దౌత్య, సైనిక మార్గాలు కొనసాగించేందుకు అంగీకారం




**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని విదేశాంగ శాఖ మరోసారి స్పష్టం చేసింది. అది ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుందని పేర్కొంది. ఈ వాస్తవాన్ని మార్చడం ఎవరితరం కాదని తేల్చిచెప్పింది. అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు భారత పేర్లను అధికారికంగా గుర్తించడంపై చైనా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ ఈ మేరకు స్పందించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో విడదీయలేని, అంతర్భాగమని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. భారత నిర్ణయాన్ని 'చెల్లదు' అంటూ చైనా చేసిన ప్రకటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు. భారత్-చైనా సంబంధాల్లో సరిహద్దు అంశాలు అత్యంత కీలకమైనవని జైస్వాల్ తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం రెండు దేశాల విస్తృత సంబంధాలకు ఎంతో ముఖ్యమన్నారు. సరిహద్దు పరిస్థితులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని స్పష్టం చేశారు. ఆగస్టు 6న జరిగిన భారత్-చైనా సరిహద్దు వ్యవహారాల సంప్రదింపులు, సమన్వయ యంత్రాంగం 36వ సమావేశంలో వాస్తవాధీన రేఖ వెంట పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగించాల్సిన అవసరాన్ని భారత్ మరోసారి నొక్కి చెప్పిందన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక మార్గాలను కొనసాగించాలని రెండు దేశాలు అంగీకరించినట్లు జైస్వాల్ తెలిపారు. డబ్ల్యూఎంసీసీ సమావేశాలు, స్థానిక కమాండర్ స్థాయి చర్చలు సహా ఇతర అంగీకరించిన మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

## బాలికలారా... మీ బంగారు భవిష్యత్ ను సరైన మార్గంలో తీర్చిదిద్దుకోండి





**అనంతపురం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** బాలికలు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, కష్టపడి సాధించేందుకు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో మహిళలదే భవిష్యత్తు అని, ప్రతి బాలిక విద్య, నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.మంగళవారం పుట్టపర్తి మామిళ్ళకుంట క్రాస్ లోని ఎస్ జి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన 'బాలికే భవిష్యత్తు' కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ తో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. బాలికలు తమలో ఉన్న ప్రతిభను గుర్తించి, జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని సాధించే దిశగా నిరంతరం కృషి చేయాలని సూచించారు.విద్యతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ఎదురయ్యే సవాళ్లకు భయపడకుండా, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని బాలికలకు సూచించారు. నిత్య జీవితంలో ఎన్నో ఆటుపోట్లు కష్టాలను ఎదుర్కొని వివిధ రంగాలలో ఎంతో మంది మహిళలు మీరా కుమారీ, కిరణ్ బేడీ ఆనంద్ గోపాల్ జోషి లాంటి వారి ఎందరో అంతర్జాతీయంగా వారి రంగాల్లో రాణించారని గుర్తు చేశారు. నిత్యం మనకు ఎదురవుతున్న ఒత్తిడిని జయిస్తూ విజయం వైపు తమ ప్రయాణాన్ని కొనసాగించాలని బాలికలకు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషి కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. విద్య ఉంటే అంతర్జాతీయంగా అన్ని రంగాల్లో రాణించవచ్చని ప్రత్యేకంగా గుర్తు చేశారు. ప్రతి ఒక్కరి తలరాతను మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉందని పేర్కొన్నారు.నేడు మహిళలు ఎంతో శక్తివంతులని వారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. బాలికలు క్రమశిక్షణతో వినయ విధేయతలతో రాణించాలని మరి ముఖ్యంగా టీనేజీ వయసు కలిగిన యువతీ యువకులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి విద్యలో రాణించాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ సంక్షేమ పథకాలతో పాటు పదవుల్లో , రాజకీయంగానే కాకుండా అనేక రంగాల్లో వారికి పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. భవిష్యత్తులో మహిళలదే రాజ్యమని అభివర్ణించారు.అంతకు ముందు కూచిపూడి నాట్యంలో అద్భుత ప్రదర్శన చేసిన చిన్నారినీ మంత్రి సవిత ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జిల్లా కలెక్టర్ ఎస్పీ మాజీ మంత్రి డాక్టర్ రఘునాథరెడ్డిలో ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సన్మానించి సత్కరించారు.అనంతరం సత్యసాయి జిల్లాకు మంజూరైన తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలను మంత్రి సవితమ్మ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఎస్పి సతీష్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీమతి సవిత, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఏఎస్పీ అంకిత సురానా, పద్మశ్రీ, అర్జున అవార్డు గ్రహీత మాలతీ హొల్లా, ప్రముఖ సైకాలజిస్ట్ సుధీంద్ర సాంద్ర, సాగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ,ఐసీడీఎస్ పీడీ ప్రమీల లు బాలికల బాధ్యతలు రక్షణ భవిష్యత్తు కార్య చరణ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు .ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు సోమలానాయక్ , ఆర్డీఓ సువర్ణ, డీఈఓ కిష్టప్ప, డిఎంహెచ్వో ఫైరోజ్ బేగం , ఇతర శాఖల అధికారులు, కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు , ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.బాలికల భవిష్యత్తు, విద్య, సాధికారత, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై కార్యక్రమంలో ప్రముఖులు విలువైన సూచనలు, మార్గదర్శకాలను అందించారు. బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా పలు అంశాలను వివరించారు.ఈ కార్యక్రమానికి భారీగా సంఖ్యలో విద్యార్థులు, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. బాలికల ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన ప్రేరణ, మార్గదర్శనం, సాధికారతపై సైకాలజిస్ట్ సుధీంద్ర సంద్ర, అర్జున, పద్మశ్రీ అవార్డు గ్రహీత మాలతీ హోల్వ లు ఈ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## కనేకల్లు రోడ్డు రైల్వే వంతెనకు త్వరలో మోక్షం

### - ప్రజా ప్రతినిధులకు కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న హామీ

**అనంతపురం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** రాయదుర్గం పట్టణంలోని కనేకల్లు రహదారిపై గత ఏడేళ్లుగా అర్ధాంతరంగా నిలిచిపోయిన రైల్వే వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను జిల్లా ప్రజాప్రతినిధులు కోరారు. ఢిల్లీలోని రైల్ భవన్‌లో మంగళవారం మంత్రి కార్యాలయంలో ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ బి. కె. పార్థసారధి కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాయదుర్గం పట్టణ పరిధిలోని కనేకల్లు అనంతపురం ప్రధాన రహదారులపై చేపట్టిన రైల్వే వంతెన నిర్మాణ పనులు గత ఏడేళ్లుగా నిలిచిపోయిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో రాయదుర్గం నుండి అనంతపురం, కనేకల్లు రెండు రైల్వే వంతెనల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గుర్తు చేశారు. అనంతరం వివిధ కారణాలతో పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అనంతపురం రహదారిపై నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన పనులను పూర్తి చేసేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అంగీకరించి రూ.46 కోట్లు మంజూరు చేసిందని ప్రజాప్రతినిధులు తెలిపారు. అయితే కనేకల్లు రోడ్డులోని రైల్వే వంతెన నిర్మాణాన్ని రైల్వే శాఖ ఆధ్వర్యంలోనే పూర్తి చేయాల్సి ఉందని వివరించారు. ముఖ్యంగా బళ్లారి–చిక్‌జాజూరు రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో కనేకల్లు రహదారిపై ఉన్న రైల్వే వంతెన నిర్మాణానికి మరింత ప్రాధాన్యత ఏర్పడిందని వారు పేర్కొన్నారు. డబ్లింగ్ పనులు పూర్తయిన తర్వాత రాయదుర్గం–తుమకూరు రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలు, రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఈ వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రికి వివరించారు.ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై



కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న సానుకూలంగా స్పందించారు. వెంటనే రైల్వే బోర్డు సభ్యులతో పాటు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ వంతెన నిర్మాణాన్ని ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుల జాబితాలో చేర్చి, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కేంద్ర మంత్రి సానుకూల స్పందనతో ఏడేళ్లుగా నిలిచిపోయిన కనేకల్లు రైల్వే వంతెన నిర్మాణ పనులకు త్వరలో కదలిక వచ్చే అవకాశం ఉందని ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. వంతెన పూర్తయితే రాయదుర్గం పట్టణ ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కలగడంతో పాటు, భవిష్యత్‌లో పెరగనున్న రైల్వే రద్దీకి అనుగుణంగా రహదారి రవాణాకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కల్లూరు వద్ద వున్న రైల్వే అండర్ బ్రిడ్జి లో నిత్యం నీళ్లు నిలిచి ఉంటాయి దీనివల్ల రెండువైపులా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు, వెంటనే చర్యలు చేపట్టాలని అనంతపురం ఎంపీ మంత్రిని కోరారు.

## ఎమ్మెల్యే సురేంద్రబాబును సన్మానించిన దొనస్వామి



**అనంతపురం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** కళ్యాణ దుర్గం నియోజకవర్గం స్థానిక శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు ని మర్యాద పూర్వకంగా కలిసిన అనంతపురం జిల్లా నూతన కురుబ సంఘం అధ్యక్షులు దొనస్వామి.పార్టీలకు అతీతంగా మా కులానికి సంబంధించిన ఏ సమస్య వచ్చినా కూడా దయచేసి మీ ఆధ్వర్యంలో పరిష్కరించాలని మనస్ఫూర్తిగా కోరిన దొనస్వామి...మీకు ఏ సమస్య వచ్చినా కూడా, ఒక అన్నలాగా, ఒక మీ కులస్తుడిగా, ఒక తమ్ముడు లాగా, బంధువులాగా అన్ని విషయాల్లో మీకు తోడుగా ఉండి సహకరిస్తానని హామీ ఇచ్చిన సురేంద్రబాబు.ఆ హామీతో సంతోషం వ్యక్తం చేసిన కురుబ కుల బంధువులు..స్వయంగా సురేంద్రబాబు దొనస్వామి కి అనంతపురం జిల్లా కురువ సంఘం అధ్యక్షులు గా పదవి స్వీకరించడం సందర్భంగా స్వీట్ తినిపించడం అందరూ సంతోషం వ్యక్తం చేశారు..

## జడ్పీ హైస్కూల్ ఆకస్మికంగా తనిఖీ చేసిన జడ్పీ సీఈవో



**తాడేపల్లిగూడెం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల అభివృద్ధి చేసిన నిర్మాణాలను జడ్పీ సీఈవో జగదాంబ మంగళవారం ఆగస్మికంగా పరిశీలించారు. హైస్కూల్లో నూతనంగా నిర్మించిన క్రీడా ప్రాంగణాలను సందర్శించి అభివృద్ధిపై నియోజకవర్గ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చూపిస్తున్న చొరవను ప్రశంసించారు. ఈ సందర్భంగా మొన్నటి వరకు నియోజవర్గ ప్రత్యేక అధికారిగా పనిచేసిన ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు క్రీడా ప్రాంగణం విశేషాలను వివరించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన పథకం భోజనాన్ని తినడంతో పాటు విద్యార్థులకు ఆమె స్వయంగా వడ్డించారు. వీటితోపాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక కార్యక్రమంలో పాల్గొని పంద్రాగస్టు వేడుకల సందర్భంగా విద్యార్థులకు స్ఫూర్తి నింపే సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఉప్పలపాటి శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం ఎంపీడీవో వి.చంద్రశేఖర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మేక సత్యనారాయణ, జడ్పీ హైస్కూల్ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు ఎన్వి సత్యనారాయణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలల వికాసమే లక్ష్యం



**పులిచెర్ల, ఆగస్టు 11, నేటి శుభోదయ :** చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీదేవి సూచించారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలకు 'జ్ఞానజ్యోతి' శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వాణిశ్రీదేవి మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల్లోపు పిల్లల్లో మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని, ఈ దశలో సరైన సంరక్షణ, ప్రోత్సాహం, అనుభవాలు అందించడం ముఖ్యమన్నారు. 'ఆధారశిల', 'నవచేతన' కార్యక్రమాల ద్వారా పిల్లల అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చన్నారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు.ఎంపీడీవో రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ.. చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలు పునాదిగా నిలుస్తున్నాయన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడంలో కార్యకర్తల పాత్ర కీలకమన్నారు. ఎంఈఓలు సీతారామయ్య, తాతయ్య మాట్లాడుతూ.. ఆటలు, పాటలు, కథల ద్వారా పిల్లల్లో ఆసక్తి, సృజనాత్మకతను పెంపొందించాలని సూచించారు. అంగన్వాడీ కార్యకర్తలు శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో సమర్థంగా అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, డీఆర్‌పీలు కృష్ణవేణి, నరేష్, రామాంజులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి , సుహాసిని, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆగస్టు 13, 14, 15 తేదీలలో సినీ సంగీత నృత్య కార్యక్రమాలు



**ఒంగోలు, ఆగస్టు 11, నేటి శుభోదయ :** ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సృజనాత్మక సమితి సౌజన్యంతో పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి సంగీత సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యములో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 13 గురువారం, 14 శుక్రవారం, 15 శనివారంలలో మూడు రోజులపాటు సినీ సంగీత నృత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి సంస్థ అధ్యక్షురాలు డా. చల్లా నాగేశ్వరమ్మ తెలిపారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా సంస్థ గౌరవ అధ్యక్షులు మండవ మురళీకృష్ణ విచ్చేస్తారని, 13, 14వ తేదీలలో జరుగు కార్యక్రమాలు స్థానిక లక్కీ కాన్ఫరెన్స్ హాల్ నందు, 15వ తేదీ కార్యక్రమం సి వి ఎన్ రీడింగ్ రూమ్ కళావేదికపై సాయంత్రం 4గం.లకు ప్రారంభమౌతాయని వివరించారు. కార్యక్రమంలో లబ్ధ ప్రతిష్టులైన గాయనీగాయకులు స్ఫూర్తివంతమైన సినీ గీతాలు ఆలపిస్తారని తెలిపారు. ఈ సినీ సంగీత నృత్య కార్యక్రమాల కరపత్రాలను మండవ మురళీకృష్ణ తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. కరపత్రావిష్కరణలో ఎస్ కే బాబు, ప్రకాశం జిల్లా కళాకారుల సమాఖ్య అధ్యక్షులు ప్రముఖ గాయని లక్ష్మీ తులసి, తాళ్లూరి శ్రీదేవి, కే లక్షి , డా. చల్లా నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

# వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన ఇన్చార్జి వడ్డీ



**తాడేపల్లిగూడెం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** ఈ రోజు తాడేపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ వడ్డీరఘు రామ్ నాయుడు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు భీమవరం ఆక్వా రైతుల సదస్సుకు కార్యకర్తలు భారీగా రావడం, అలాగే దేవరపల్లి పొగాకు రైతుల సదస్సు కూడా కార్యకర్తలు భారీగా రావడం వలన మూడు రోజులు రిలే నిరాహార దీక్షలు సక్సెస్ అవడం వల్ల సోమవారం జరిగిన మోటార్ సైకిల్ ర్యాలీకి భారీగా కార్యకర్తలు వచ్చి పాల్గొనడం పోలీసు వారు ఎన్ని ఆంక్షలు పెట్టిన కార్యకర్తలు లెక్కచేయకుండా భారీగా తరలివచ్చి సక్సెస్ అవడం జగన్ మోహన్ రెడ్డి అభినందించారని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. రాబోయే రోజులలోతాడేపల్లిగూడెంలో వైసీపీ జెండా ఎగరటం ఖాయమని రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

# ఫోటో గ్రాఫర్స్ నైపుణ్య శిక్షణ కార్యక్రమం



**తాడేపల్లిగూడెం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** పశ్చిమగోదావరి జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ మరియు, తాడేపల్లిగూడెం ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఫోటోగ్రాఫర్స్ కెమెరాల్లో వస్తున్న సాంకేతిక మార్పులను తెలుసుకోవాలని మెంటార్ భూపాల్ సూచించారు. మంగళవారం తాడేపల్లిగూడెం ఓ ఫంక్షన్ హాలులో నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కెనాన్ కొత్త కెమెరా సాంకేతిక పరిజ్ఞానంపై ఫొటో, వీడియో గ్రాఫర్లకు అవగాహన కల్పించారు. టెక్నాలజీపై అవగాహనతోనే భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం,జిల్లాఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గ నాయకులు,తాడేపల్లిగూడెం ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను, కాపాక గంగాధర్ , అయితం ప్రసాద్ లను ఘనంగా సత్కరించారు. ఉభయగోదావరి జిల్లాల అసోసియేషన్ చైర్మన్ మరడాని రాము, కెనాన్ కంపెనీ ఏ.ఎస్.ఎం సభ్యులు, ఫోటోగ్రాఫర్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సాగునీటి కోసం మాదేపల్లి లో కృష్ణా డెల్టా రైతులు రోడ్డు దిగ్బంధనం






**ఏలూరు, ఆగస్టు 11, నేటి శుభోదయ :** సాగునీటి కోసం కృష్ణా డెల్టా రైతులు మాదే పల్లి వద్ద ఏలూరు– కైకలూరు రోడ్డు దిగ్బంధనం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వరి నారుమళ్ళు ఎండిపోతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోరా అంటూ ఎండిన వరి నారుతో అన్నదాతల ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలియజేశారు. మండుటెండలో రాస్తారోకో నిర్వహించారు. సాగునీరు ఇచ్చి ఆదుకోండి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణా డెల్టా రైతులు పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. అనేక ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రకాశం బ్యారేజీకి పెద్ద ఎత్తున నీరు వస్తోందని ఈ నీటిని కృష్ణా డెల్టాకు సాగుకు ఇస్తున్నామని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని చెప్పారు. అయినా కేఈ కెనాల్ కు సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఏలూరు రూరల్ మండలంలోని 10 పదివేల ఎకరాల కృష్ణా ఆయకట్టుకు పోణంగి పుంత కాలువ ద్వారా గోదావరి జలాలు అందించే అవకాశం ఉందన్నారు. ఈ కాలువకు వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తూర్పులాకులు నుండి గోదావరి నీటిని తోడి కృష్ణా డెల్టాకు అందించాలని కోరారు. గడిచిన నెలరోజుల కాలంలో గోదావరి జలాలు దాదాపు 500 టీఎంసీలు సముద్రం పాలయ్యాయని చెప్పారు. పట్టిసీమ నీరును దాదాపు 20 టిఎంసిలు కృష్ణాకి మళ్ళించినా కృష్ణా డెల్టా శివారు భూములకు సాగునీరు అందించలేకపోవడం ఇది ప్రభుత్వ వైఫల్యం అన్నారు. నారుమళ్ళు ఎండిపోతున్నాయని, నాట్లు వేసిన చేలకు నీరు అందడం లేదని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కృష్ణా డెల్టా ఆయకట్టుకు సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా డెల్టా రైతులు వాడవల్లి రామారావు,పైడిపాటి భాస్కరరావు, తలారి జయరాజు, పుట్టి దుర్గాప్రసాద్,మారుమూడి సువర్ణ రాజు, బండి శ్రీనివాసరావు, దాసరి నాగేశ్వరరావు, శలా సూరిబాబు, బైరెడ్డి లక్ష్మణరావు, కోన శ్రీనివాసరావు, కట్టా సర్వేశ్వరరావు, కోన నరసింహులు, చిన్ని పోతురాజు మరియు మాదేపల్లి, జాలిపూడి, లింగారావుగూడెం, కాట్లపూడి, సుంకర వారి తోట తదితర గ్రామాల రైతులు కౌలు రైతులు పాల్గొన్నారు..

# డైమండ్స్ లయన్స్ క్లబ్ ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షల శిబిరం




**తాడేపల్లిగూడెం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** మధుమేహంపై అశ్రద్ధ చేయవద్దని లయన్స్ రిజియన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు.స్థానిక ఆర్ అండ్ బి గ్రౌండ్స్ లో క్లబ్ వైస్ ప్రెసిడెంట్ లయన్ వేగేశ్న రామరాజు అధ్యక్షతన వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన డైమండ్స్ లయన్స్ ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షల శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివయసుల వారిని పీడిస్తున్న మహమ్మారి డయాబిటిస్ అని ఆహారపు అలవాట్లు మార్చుకోవడం, నడక వ్యాయామం లాంటి వాటి ద్వారా షుగర్ నియంత్రణ ఉండాలని నిపుణులైన వైద్యులు సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మానేపల్లి కిరణ్, కంచర్ల నరసింహ, గాజుల మురళీకృష్ణ, రాజా త్రినాధ్ లు మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలని షుగర్ హెచ్చు తగ్గులు ప్రతి నెల క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని, ప్రతినెలా ఫ్రీ క్యాంపు అందిస్తున్న పేరిచర్ల ఫౌండేషన్ డైమండ్స్ లయన్స్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వాకర్ దంగేటి ముఖర్జీ ఆధ్వర్యంలో వాకర్స్ కు షుగర్ క్యాంప్ లో పాల్గొన్న వారికి చిరు ధాన్యాలు, రాగి జావా పౌష్టికాహారం పై అవగాహన కల్పించి అందరికి అల్పాహారం, రాగి జావలు అందిం–చారు. దంగేటి ముఖర్జీ మాట్లాడుతూ వాకర్స్ యోగ సభ్యులు అందరికి మార్గదర్శకం గా ఉండాలని ప్రతినెలా ఈ ఆహారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నామని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బాబురావు,సుబ్బారావు గుప్తా, గ్రంధి శ్రీనివాస్ వరప్రసాద్, యర్రా ఆంజనేయ స్వామి, ఈశ్వర్ రెడ్డి,సత్యనారాయణ, వ్యాయామఉపాధ్యాయులు చింతకాయల సత్య నారాయణ,యెలిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ పై లోకేష్ క్రెడిట్ రావడానికి జీర్ణించుకోలేకే వైసిపి విష ప్రచారం....

## మెగా డీఎస్సీ పై వైసీపీ విష ప్రచారం



**అమరావతి, ఆగస్టు 11, నేటి శుభోదయ :** రాష్ట్రంలో డీఎస్సీ పై లోకేష్ కు క్రెడిట్ రావడానికి జగన్ జీర్ణించుకోలేక లోకేష్ పై కూటమి ప్రభుత్వంపై వైసిపి పేటియం బ్యాచ్ విష ప్రచారం చేయడానికి తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాతర్లరమేష్ మండిపడ్డారు అమరావతి లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ కేవలం తన స్వార్ధ రాజకీయాల కోసమే తమ కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాడని ఆయన విమర్శించారు కూటమి ప్రభుత్వం 16 వేల టీచర్ ఉద్యోగాలను భర్తీని వైసిపి జీర్ణించుకోలేక వైసిపి విష ప్రచారాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు కూటమి ప్రభుత్వం పారదర్శకంగా జరిగిన మెగా డీఎస్సీ పై ఇంకా జగన్ పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నాడని ఆయన ఆరోపించారు జగన్ ఐదేళ్ల పాలనలో కనీసం ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని ఆయన విమర్శించారు గత వైసిపి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి నిరుద్యోగులను దగా చేశారని ఆయన విమర్శించారు మెగా డీఎస్సీ పై వైసీపీ కపట్టి నాటకాలాడుతున్నారని వయోవృద్ధులు రాజకీయ నిరుద్యోగులతో వైసిపి నిరసనలు చేస్తుందని ఆయన ఆరోపించారు డీఎస్సీ నోటిఫికేషన్ నిలుపుదల కోసం వైసీపీ కోట్ల ఖర్చు పెట్టారని ఆయన ఆరోపించారు నిరుద్యోగులను రెచ్చగొట్టేందుకు వైసిపి కుట్ర చేస్తూ తమ కూటమి ప్రభుత్వం పైన విష ప్రచారం చేస్తుందని ఆయన మండిపడ్డారు వైసిపికి చెంప చెల్లుమనిపించేలా ఉపాధ్యాయులు ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారని ఇప్పటికైనా వైసీపీ తీరు మార్చుకోకపోతే ప్రజల బుద్ధి చెప్తారని ఆయన అన్నారు నిరుద్యోగులకు ఉద్యోగం ఇస్తామని ఎన్నికల ముందు చెప్పామని ఆ విధంగానే కోటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని ఆయన తెలిపారు సంవత్సరం తర్వాత ఢిల్లీలో పేపర్ లీక్ అయిందని లోకేష్ రాజీనామా చేయమన్నటం సిగ్గుచేటు అన్నారు కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకే నిరుద్యోగుల పేరట దుష్ట రాజకీయం చేస్తున్నారని ఆయన విమర్శించారు మెగా డీఎస్సీలో ఉద్యోగాలు వచ్చిన ఉపాధ్యాయులు రోడ్డు మీదకు వచ్చి కోట కూటమి ప్రభుత్వానికీ అండగా ర్యాలీలు చేశారని అది చూసేనా జగన్ సిగ్గుపడాలని ఆయన తెలిపారు మెగా డీఎస్సీలో ఎక్కడా తప్పు జరగలేదని జగన్ తన స్వార్ధ రాజకీయాల కోసమే విష ప్రచారం చేస్తున్నాడని పాతర్లరమేష్ మండిపడ్డారు

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తాం : ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**చింతూరు, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీషాదేవి మంగళవారం చింతూరు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకుని ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, మౌలిక వసతులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు.ముకునూరు, చిడుమూరులో ఇంటింటి తెలుగుదేశం చింతూరు మండల పర్యటనలో భాగంగా ముకునూరు, చిడుమూరు గ్రామాల్లో నిర్వహించిన 'ఇంటింటి తెలుగుదేశం' కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పాల్గొన్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజలను నేరుగా కలుసుకున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలు, అవసరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ప్రజల



నుంచి వచ్చిన వినతులు, అభ్యర్థనలను స్వీకరించిన ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ చింతూరు మండల అభివృద్ధికి ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పర్యటన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు.ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి, చింతూరు మండల అభివృద్ధికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తారని జమాల్ ఖాన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కోట్ని బాలాజీతో పాటు పలువురు టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగాసనాల్లో సత్తా.. రాష్ట్రస్థాయికి



**పనపాకం, ఆగస్టు 11, దమ్మపేట, నేటి శుభోదయ :**
యోగా పోటీల్లో పనపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. తిరుపతి లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 14–16 ఏళ్ల బాలుర విభాగంలో సంతోష్, బాలికల విభాగంలో కుందన శిల్ప ప్రథమ స్థానాలు సాధించగా, ఐశ్వర్య ద్వితీయ స్థానం పొందింది. 12–14 ఏళ్ల విభాగంలో ధనుష్ ప్రథమ, వినయశ్రీ ద్వితీయ స్థానాలు సాధించారు. 10–12 ఏళ్ల విభాగంలో బాలు ద్వితీయ, జ్యోత్స్న తృతీయ స్థానాల్లో నిలిచారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం మంజువాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు జయచంద్ర అభినందించారు.

## నేను రైతు పక్షపాతిని

**పల్నాడు, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
కారంపూడి మిర్చి రైతుల కథ మరో మలుపు తిరిగింది. మిర్చి వ్యాపారి అయ్యప్ప వద్ద నుండి ఇప్పటికే ఎస్సై వాసు వజ్రాల్ని రికవరీ చేశారు. వాటి సంగతి ఏంటి వజ్రాలు ఎక్కడ ప్రస్తుతం నడుస్తున్న హాట్ టాపిక్... టిడిపి రాష్ట్ర కార్యదర్శి పంగులూరు అంజయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొంతమంది మిర్చి రైతులు ఐజి ఆఫీస్ వద్ద ప్రెస్ మీట్ లో నాపై తప్పుడు ఆరోపణలు చేశారని అన్నారు.. బట్టువారిపల్లి గ్రామానికి చెందిన పాశం నాగార్జున అని రైతు  బోల్నడి శ్రీను అంజయ్య మరి కొంతమంది స్థానిక నాయకులు తమకు అన్యాయం చేశారని చెప్పగా దానిపై పాశం నాగార్జునను వివరణ కోరగా నువ్వు ఎవరో నాకు తెలియదు కొంతమంది కావాలని నా చేత అలా చెప్పించారని నాగార్జున తెలిపినట్లు అంజయ్య అన్నారు.. తను రైతు పక్షపాతినే గాని రైతులకు అన్యాయం చేస్తే ఊరికే ఉండబోనని అన్నారు ఇప్పటికే మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి రైతులను న్యాయం జరగాలంటూ అధిష్టానం వద్దకు వెళ్లి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నారని అన్నారు. ఎస్సై వాసు వ్యాపారి అయ్యప్ప వద్దనుండి మూడు వజ్రాలను రికవరీ చేశారని వజ్రాలతో పాటు మరికొంత నగదును కూడా వ్యాపారి వద్ద నుండి వసూలు చేసి రైతులకు తిరిగి ఇప్పించేలా ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి కృషి చేస్తున్నారని అన్నారు.

## 160 కి.మీ అల్ట్రా రన్ అండ్ సైక్లింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ అథ్లెట్, మోడర్న్ పెంటాథ్లాన్ జాతీయ క్రీడాకారుడు గోవింద్ రాజు కొక్కిరిపాటి (రాజు కె) చేపట్టిన "160 కిలోమీటర్ల అల్ట్రా రన్ & సైక్లింగ్ ఛాలెంజ్" అధికారిక పోస్టర్‌ను రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు శ్రీ కొల్లు రవీంద్ర  ఆవిష్కరించారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడంతోపాటు ఆరోగ్యం పట్ల అవగాహనను పెంపొందించాలనే గొప్ప లక్ష్యంతో 'రన్ ఫర్ ఫ్రీడమ్ – రైడ్ ఫర్ ప్రైడ్' అనే పవర్ ఫుల్ నినాదంతో చేపట్టిన ఈ అల్ట్రా ఎండ్యూరెన్స్ ఛాలెంజ్ ఘన విజయం సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5గంటలకు మచిలీపట్నంలోని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, జెండా వీరుడు తోట నరసయ్య స్వగృహం నుండి విజయవాడ ఇంద్రకీలాద్రి వరకు 80 కిలోమీటర్ల మేర రన్, తిరిగి 15వ తేదీ ఉదయం విజయవాడ ఇంద్రకీలాద్రి నుండి మచిలీపట్నంలోని జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ వరకు 80 కిలో మీటర్ల మేర సైక్లింగ్ నిర్వహించడం నిజంగా సాహసోపేతమైన నిర్ణయమని కొనియాడారు. క్రీడాభి



మానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రాజును ప్రోత్సహించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారిణి ఝాన్సీ, సీనియర్ జర్నలిస్ట్ ముదిగొండ శాస్త్రి, శిష్టకరణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు అక్కమహంతి రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఆన్లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ ఎస్. ఐ. నాగరాజు

**గుడివాడ, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ట్రాఫిక్ ఎస్. ఐ. పి. నాగరాజు అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక హోలీక్రాస్ స్కూలు విద్యార్థులకు అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడుతూ గుడ్ సమారిటన్,  పీఎం– రాహత్ గురించి తెలియపరుస్తూ, ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు బాధితుడిని 60 నిమిషాలు లోపు హాస్పిటల్ లో జాయిన్ చేసి బాధితుడి ప్రాణాలు కాపాడాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి. ఎం.ఆర్ హెచ్ ఎ టి గురించి తెలియపరుస్తూ రోడ్డు ప్రమాద బాధితులకు 'పీఎం–రాహత్' వరమని, రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్య సహాయం చేసిన 'రహ–వీర్'లకు రూ.25వేల నగదు బహుమతి ఉంటుందని, రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలు కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం–రాహత్' పథకం మంచి వరమనే పేర్కొన్నారు. ప్రమాదానికి గురైన ఎవరైనా సరే (పాదచారులు, వాహనదా



రులు, లేదా విదేశీయులు) గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో గరిష్టంగా రూ.1.5 లక్షల వరకు వైద్య సహాయం అందుతుందని తెలిపారు. సహాయం అందించిన వ్యక్తులపై ఎటువంటి సివిల్ లేదా క్రిమినల్ చర్యలు తీసుకోరని, ఆసుపత్రికి ప్రమాద బాధితుడుని చేర్చిన తర్వాత ఆ వ్యక్తి వెళ్లిపోవచ్చన్నారు. పోలీసులు ఎటువంటి ప్రశ్నలు అడగరని పేర్కొన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు డయల్ 112 కి కాల్ చేయాలని, మరియు ఆన్లైన్ మోసాలకు సంబంధించి 1930 కి కాల్ చేయాలని తెలియపరిచినారు.ఈ కార్యక్రమంలో హోలీ క్రాస్ స్కూల్ హెచ్.ఎం అమలావతి, టీచర్స్, గుడివాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.జిల్లా ఎస్. పి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు గుడివాడ డి. ఎస్. పి. పాలా శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించామని ట్రాఫిక్ ఎస్. ఐ. నాగరాజు తెలిపారు.

## పోగొట్టుకున్న స్మార్ట్‌ఫోన్‌ను తిరిగి అందించిన ఆటో డ్రైవర్



**గుడివాడ, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
రోడ్డు పై దొరికిన స్మార్ట్ ఫోన్ను ఆటో డ్రైవర్ నిజాయితీగా కానిస్టేబుల్ కి అప్పగించి తన నిజాయితీని నిరూపించుకున్నాడు.వివరాల్లోకి వెళితే గుడివాడ నెహ్రూ చౌక్ సెంటర్ సమీపంలో పోగొట్టుకున్న స్మార్ట్‌ఫోన్‌ను గుర్తించిన ఓ ఆటో డ్రైవర్ నిజాయితీగా ఫోన్‌ను తీసుకువచ్చి ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావుకు అందజేసారు. ఫోన్ ఎవరిదైతే వారికి తిరిగి ఇవ్వాలని ఆటో డ్రైవర్ కానిస్టేబుల్ ను కోరారు.అనంతరం ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ట్రాఫిక్ సిబ్బందిని సంప్రదించగా, ఫోన్ తనదేనని నిర్ధారించేందుకు వేలిముద్ర, కీ తదితర వివరాలను పరిశీలించిన అనంతరం ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి ఫోన్ ను అందజేశారు. పోగొట్టుకున్న ఫోన్‌ను నిజాయితీగా పోలీసులకు అప్పగించిన ఆటో డ్రైవర్‌ను, ఫోన్‌ను యజమానికి తిరిగి అందించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావును పలువురు అభినందించారు.

## కమలపాడు, చింతలాయపల్లి గ్రామాలలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల ఎన్నిక



**యాడికి, ఆగస్టు 11, నేటి శుభోదయ :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, అనంతపురం జిల్లా ఇంచార్జ్ చిన్న సుబ్బారావు మాదిగ, కో–ఇంచార్జ్ కోళ్ల కళ్యాణ్ మాదిగ సూచనలతో యాడికి మండలంలోని కమలపాడు, చింతలాయపల్లి గ్రామాలలో మంగళవారం నూతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీఎస్ మండల నూతన గ్రామ కమిటీల ఇంచార్జ్ ఎంపీ పుల్లయ్య మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటం చేసి సాధించిన ఏబీసీడీ ఎస్సీ వర్గీకరణ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలని పిలుపునిచ్చారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించి, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేవరకు ప్రతి ఒక్కరూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో భాగస్వాములై పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాతకుట్ల బాలు మాదిగ, ప్రధాన కార్యదర్శి జానకిరాముడు మాదిగ, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు మాదిగ, సీనియర్ నాయకులు నరసింహులు, సూర్యుడు, వెంకటేష్, రమణయ్య, పుష్పరాజులతో పాటు గ్రామ యువకులు శివకృష్ణ, శివశంకర్, భరత్, బాబాయ్, రామంజి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నేతలపై హోంమంత్రి అనిత ఆగ్రహం..



**విశాఖపట్నం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** 11 వైసీపీ నేతల తీరుపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ పోలీసులతో ర్యాలీలు నిర్వహించే వారు ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తారని ప్రశ్నించారు. “గొడ్డలి పార్టీ” నేతలకు రాజకీయాల్లో కొనసాగేందుకు అర్హత లేదని వ్యాఖ్యానించారు. వైసీపీ క్రిమినల్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. పోలీసు వ్యవస్థ గౌరవం, విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధిలో కొనసాగుతున్న మహిళా భక్తుల రద్దీ



**విజయవాడ, ఆగస్టు 11, నేటి శుభోదయ :** శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రి పై ఆషాఢ సారె 28వ రోజు మంగళవారం శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా భక్తులతో రద్దీ విశేషంగా పెరిగింది. సాయంత్రం 5 గంటల వరకు 32 సారె బృందాలు రాగా 13654 మంది భక్తులు సారె ను సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.సారె బృందాలకు ఉచిత దర్శనంతో పాటు, వేద పండితులు, వేదాశీర్వచనం అందజేసి, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

## రౌడీషీటర్‌పై బైండ్ఓవర్ చర్యలు - ప్రజలకు పోలీసుల హెచ్చరిక

**తాడేపల్లిగూడెం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ బండి కాళీ కృష్ణ పై పోలీసు శాఖ నిఘా కొనసాగుతోంది. సదరు వ్యక్తి గతంలో రెండు హత్య కేసులతో పాటు మరో ఐదు కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీసు రికార్డుల్లో నమోదై ఉంది.ప్రస్తుతం అతని ప్రవర్తనను పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందనే నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అతనిపై బైండ్ఓవర్ చర్యల కోసం సంబంధిత ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టుకు ప్రతిపాదనలు పంపించడం జరిగింది.సదరు వ్యక్తి కార్యకలాపాలు, ప్రవర్తన మరియు అతని కదలికలపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుంది. అతని ప్రతి చర్యను పోలీస్ స్టేషన్ రికార్డుల్లో నమోదు చేసి, చట్టపరమైన నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటారు.ప్రజలు ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోరాదు. రౌడీషీటర్లు లేదా ఇతర అసాంఘిక వ్యక్తుల వల్ల ఎటువంటి బెదిరింపులు, గొడవలు, అసాంఘిక కార్యకలాపాలు లేదా శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ వ్యక్తినీ ఉపేక్షించేది లేదు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విజన్ విద్యార్థి గణేష్ ఎంపిక



**యాడికి, ఆగస్టు 11, నేటి శుభోదయ :** అనంతపురం ఛాంపియన్షిప్ – 2026 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు తాడిపత్రికి చెందిన విజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి ఓగేటి గణేష్ ఎంపికయ్యాడు. స్థానిక ఆర్ట్స్ కాలేజీ మైదానంలో మంగళవారం ఎంతో ఉత్సాహంగా సాగిన జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీల్లో గణేష్ తాడిపత్రి జట్టు తరపున బరిలోకి దిగి తన అద్భుతమైన ఆటతీరుతో ప్రతిభ చాటాడు. ఈ పోటీలలో హోరాహోరీగా తలపడిన తాడిపత్రి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్‌గా అవతరించగా, జట్టులో కీలక పాత్ర పోషించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన గణేష్ అనంతపురం జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్ వెల్లడించారు. త్వరలో నిర్వహించబోయే అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్ర స్థాయి పోటీలలో గణేష్ జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి తన నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నాడని ఆయన పేర్కొన్నారు. విద్యార్థి గణేష్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల విజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడలలో రాణించడం అభినందనీయమని, రాబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా గణేష్ విజయం సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించిన వారిలో పాఠశాల ఉపాధ్యాయ బృందం అమర్, శేఖర్, కోటిలతో పాటు పలువురు సిబ్బంది ఉన్నారు

## రాష్ట్ర బోయ వాల్మీకి ఐక్యత పోరాట సమితి యాడికి మండల నూతన కమిటీ ఎన్నిక




**యాడికి, ఆగస్టు 11, నేటి శుభోదయ :** మండల కేంద్రమైన యాడికిలో రాష్ట్ర బోయ వాల్మీకి ఐక్యత పోరాట సమితి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. రాష్ట్ర సంఘ అధ్యక్షులు చక్రాల శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఈ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా పూలతోట రవికుమార్, ఉపాధ్యక్షుడిగా బి.నాగేష్, మండల గౌరవ సలహాదారుడిగా కర్నూలు రంగనాయకులు, సంయుక్త కార్యదర్శిగా పూలతోట రామచంద్ర, తాలూకా కోశాధికారిగా టింబరు డిపో రాజు బాధ్యతలు చేపట్టారు.అలాగే వాల్మీకి యువత జిల్లా అధ్యక్షుడిగా పూలతోట ఇంద్రప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడిగా గుంత శ్రీనివాసులు, మండల అధ్యక్షుడిగా పూలతోట మధు, మండల ఉపాధ్యక్షుడిగా సి.రవిశంకర్ ఎన్నికయ్యారు. సమితి కమిటీ సభ్యులుగా హరికృష్ణ, కర్నూలు అజయ్, రామన్న గుడిసెల జి.రాజు, నాయకుడు ఎం.కృష్ణమూర్తి, రామన్న, కోనప్పలపాడు గుడిసెల నాయకుడు జి.రాజు, గుడిపాడు రైతు సంఘం తాలూకా యువ నాయకుడు డి.కంబగిరి స్వామి, తాలూకా నాయకుడు డి.పెద్దపుల్లయ్యలను నియమించారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. వాల్మీకి సోదరులందరినీ ఏకతాటిపైకి తెచ్చి సంఘాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. సామాజిక సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వాల్మీకి సోదరులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# నేను రైతు పక్షపాతిని

## రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోను..

### - టిడిపి రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య...



**పల్నాడు, ఆగస్టు 11, నేటి శుభోదయ :** కారంపూడి మిర్చి రైతుల కథ మరో మలుపు తిరిగింది. మిర్చి వ్యాపారి అయ్యప్ప వద్ద నుండి ఇప్పటికే ఎస్సై వాసు వజ్రాల్ని రికవరీ చేశారు. వాటి సంగతి ఏంటి వజ్రాలు ఎక్కడ ప్రస్తుతం నడుస్తున్న హాట్ టాపిక్... టిడిపి రాష్ట్ర కార్యదర్శి పంగులూరు అంజయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొంతమంది మిర్చి రైతులు ఐజి ఆఫీస్ వద్ద ప్రెస్ మీట్ లో నాపై తప్పుడు ఆరోపణలు చేశారని అన్నారు.. బట్టువారిపల్లి గ్రామానికి చెందిన పాశం నాగార్జున అని రైతు బోల్నడి శ్రీను అంజయ్య మరి కొంతమంది స్థానిక నాయకులు తమకు అన్యాయం చేశారని చెప్పగా దానిపై పాశం నాగార్జునను వివరణ కోరగా నువ్వు ఎవరో నాకు తెలియదు కొంతమంది కావాలని నా చేత అలా చెప్పించారని నాగార్జున తెలిపినట్లు అంజయ్య అన్నారు.. తను రైతు పక్షపాతినే గాని రైతులకు అన్యాయం చేస్తే ఊరికే ఉండబోనని అన్నారు ఇప్పటికే మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి రైతులను న్యాయం జరగాలంటూ అధిష్టానం వద్దకు వెళ్లి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నారని అన్నారు. ఎస్సై వాసు వ్యాపారి అయ్యప్ప వద్దనుండి మూడు వజ్రాలను రికవరీ చేశారని వజ్రాలతో పాటు మరికొంత నగదును కూడా వ్యాపారి వద్ద నుండి వసూలు చేసి రైతులకు తిరిగి ఇప్పించేలా ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి కృషి చేస్తున్నారని అన్నారు.

# స్వామి వివేకానంద జీవిత సందేశంపై ఫోటో ఎగ్జిబిషన్





**మాచర్ల, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
శ్రీరామకృష్ణ సేవా సమితి మాచర్ల ఆధ్వర్యంలో స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో మంగళవారం స్వామి వివేకానంద జీవితము, సందేశంపై ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థుల్లో స్వామి వివేకానంద ఆశయాలు, దేశభక్తి, నైతిక మరియు ఆధ్యాత్మిక విలువలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు.పాఠశాల హెచ్ఎం హరిణి మేడంతో కలిసి మెట్టు గోవిందరెడి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఫోటో ఎగ్జిబీషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద తన సాహిత్యం, ప్రసంగాల ద్వారా అనేక మంది స్వాతంత్ర సమరయోధులకు, యువతకు స్ఫూర్తినిచ్చారని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించుకుని స్వామి వివేకానంద కలలుగన్న నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పాఠశాల ప్రిన్సిపల్ హరిణి మాట్లాడుతూ విద్యార్థులకు స్వామి వివేకానంద జీవితం, సందేశాన్ని పరిచయం చేసే విధంగా ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత దేశం, సమాజం, పేద ప్రజల కోసం సేవా భావంతో ముందుకు సాగాలని కోరారు.గత 20 సంవత్సరాలుగా శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన, డిబేట్ తదితర పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవా సమితి సభ్యులు ముత్యాల పాపిరెడ్డి, చైతన్య టెక్నో స్కూల్ డీన్ అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 23న డాక్టర్ ఉండేలా మాలకొండా రెడ్డి జయంతి వేడుకలు

**ఒంగోలు, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
ప్రముఖ కవి, విద్యావేత్త, సి.బి.ఐ.టి, ఎం.జి.ఐ.టి. విద్యా సంస్థల వ్యవస్థాపకులు డా. ఉండేల మాలకొండారెడ్డి 98వ జయంతి వేడుకలు ఈనెల 19వ నుండి 23వ తేదీ వరకు ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు జయంతి వేడుకల అధ్యక్షులు జి.గురవారెడ్డి తెలిపారు. మంగమూరు రోడ్ లోని సంఘ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జయంతి వేడుకల వివరాలను వెల్లడించారు. దీనిలో భాగంగా 19వ తేదీ నుండి 22వ తేదీ వరకు పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23వ తేదీ ఉండేల మాలకొండ రెడ్డి 98వ జయంతి సందర్భంగా ఒంగోలులోని అంబేద్కర్ భవనంలో సాయంత్రం 4 గంటల నుంచి జిల్లాలోని ప్రముఖ కవులచే కవి సమ్మేళనం, చందు డాన్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన, క్రియేటివ్ కల్చరల్ అకాడమి వారి ఆధ్వర్యంలో ప్రముఖ కవి గుఱ్ఱం జాషువా మనవడు సుశీల్ కుమార్, భారతి బృందంచే దేశభక్తి, ప్రబోధాత్మక గీతాల ఆలాపన, జయంతి సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఒంగోలు పార్లమెంటు సభ్యులు



మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఉండేల మాలకొండా రెడ్డి కుటుంబ సభ్యులు డాక్టర్ జయశ్రీ, డాక్టర్ రాజశ్రీ, ఉషశ్రీ, సంధ్య శ్రీ, సి.బి.ఐ.టి. కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉండేల వెంకట రమణ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో క్రియేటివ్ కల్చరల్ అకాడమీ అధ్యక్షులు పత్రా శివ పాల్గొన్నారు. పోటీలో పాల్గొనదలిచిన విద్యార్థినీ విద్యార్థులు సెల్ 9177046553 సంప్రదించవలసినదిగా కోరారు.

# గార్బేజ్ వల్నరబుల్ పాయింట్‌ను సెల్ఫీ పాయింట్‌గా తీర్చిదిద్దుతున్నాం

**- పరిశుభ్రతతో పాటు సుందరీకరణకు ప్రాధాన్యత వియంసి కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
తరచుగా వ్యర్థాలు పడే చోటను అందమైన సెల్ఫీ పాయింట్ గా తీర్చిదిద్దాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం ఎంజీ రోడ్, టిక్కిల్ రోడ్, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, శివరామకృష్ణయ్య వీధి, కే. వెంకయ్య వీధి, గాయత్రీనగర్ మెయిన్ రోడ్, ఎన్‌హెచ్ సర్వీస్ రోడ్, ఎంజీ రోడ్, ఎన్టీఆర్ సర్కిల్, కృష్ణవేణి స్కూల్ రోడ్, హైస్కూల్ రోడ్, పంటకాలువ రోడ్, నిర్మల స్కూల్ రోడ్, ఎన్‌హెచ్–బెంజ్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. నగరంలో తరచుగా వ్యర్థాలు పడే చోటను (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ –GVP)ను ప్రజలను ఆకర్షించేలా సుందరీకరించి సెల్ఫీ పాయింట్‌గా రూపాంతరం చేసే కార్యక్రమాన్ని విజయవాడ నగరపాలక సంస్థ చేపట్టింది. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కు నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తున్న (AIILSG) సహకారంతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా శివరామకృష్ణయ్య వీధిలోని GVPను సెల్ఫీ పాయింట్‌గా అభివృద్ధి చేస్తున్న పనులను నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరంలో వ్యర్థాలు పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి వాటిని
సుందరంగా తీర్చిదిద్దడం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు, ఆయా ప్రాంతాలను ఆకర్షణీయంగా మార్చడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులు, అవుట్‌ఫాల్ డ్రెయిన్ పనులు, పారిశుధ్య నిర్వహణ, రోడ్లు, పరిసరాల పరిస్థితులను పరిశీలించారు. ప్రతి ప్రాంతంలో పనుల పురోగతి, నాణ్యత, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులకు అక్కడికక్కడే అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులను సమన్వయంతో, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.హైస్కూల్ రోడ్‌లోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ ప్రత్యేకంగా పరిశీలించారు. క్యాంటీన్‌లోని ఫ్యాన్లు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కమిషనర్, వాటిని వెంటనే శుభ్రపరచి క్యాంటీన్‌లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని సూచించారు. అదేవిధంగా క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలిస్తూ, ప్రతిరోజూ ఆహార నాణ్యత ఒకే విధంగా కొనసాగుతుందా లేదా నాణ్యత తగ్గుతుందా అనే అంశాన్ని నిరంతరం తనిఖీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందించే ఆహారంలో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్చార్జి డాక్టర్ గోపాల నాయక్, డీడీహెచ్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇంచార్జ్ రామారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, AIILSG నోడల్ ఆఫీసర్ మరియు ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ ఎ. శివన్నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్. సన్నీ, గ్రీన్‌మాత్రు సోషల్ మీడియా ఎక్స్‌పర్ట్, సిబ్బంది పాల్గొన్నారు. పాల్గొన్నారు.




# శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న నేషనల్ కమీషన్ ఫర్ షెడ్యూల్ క్యాస్ట్ వారు, సోషల్ వెల్ఫేర్ శాఖ వారు




**విజయవాడ, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
నేషనల్ కమీషన్ ఫర్ షెడ్యూల్ క్యాస్ట్ కార్యదర్శి జి. శ్రీనివాస్,డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్ బాబు, శ్రీమతి లావణ్య వేణి, సెక్రటరీ, సోషల్ వెల్ఫేర్ శాఖ వారు సోమవారం సాయంత్రం శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో వికె శీనా నాయక్ వారిని స్వాగతించి, శ్రీ అమ్మవారి దర్శనం చేయించారు.అనంతరం వేద పండితులు, వేదాశీర్వచనం అందజేసి, అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

# శ్రీ అమ్మవారి అలంకారంలో శ్రీ జగన్మాత ను దర్శించుకున్న భక్తురాలు



**విజయవాడ, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
విజయవాడ లోని పాల ఫ్యాక్టరీ నుండి మంగళవారం దేవి అనే భక్తురాలు శ్రీ అమ్మవారి అలంకారం ధరించి శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆమె తో మాట్లాడి దేవి ని అభినందనలతో ముంచెత్తారు.

# మాజీ సీఎం వైయస్ జగన్ ను కలిసిన దాసరి వాసంతి సాహిత్య



**అనంతపురం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** మాజీ సీఎం వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని మాజీ డిప్యూటీ మేయర్ దాసరి వాసంతి సాహిత్య కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో దాసరి వాసంతి సాహిత్య కుటుంబ సభ్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి కి పుష్పగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా వాసంతి సాహిత్య, బండి శ్రీకాంత్ వారి కుటుంబ సభ్యులను వైయస్ జగన్మోహన్ రెడ్డి కాసేపు మాట్లాడారు. అనంతపురం జిల్లాలో రాజకీయ పరిస్థితులు ఎలాగ ఉన్నాయని ఆరా తీశారు. వైసిపి పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేయాలని వారికి ఆయన సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి విజయ డంక మోగాలని సూచించారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి అభ్యర్థిని గెలిపించడానికి కృషి చేయాలని తెలిపారు.

# భీమిలి పోలీసుల డ్రగ్ అవగాహన ప్రచారం..!



**విశాఖపట్నం, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
విశాఖపట్నం నేటి శుభోదయ ఆగస్టు :11 విశాఖ సిటీ పోలీస్ కమీషనర్ డ్రా శంకబ్రత బాగ్చి ఐపీస్ ఆదేశాల మేరకు భీమిలి సి.ఐ దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలలో ముఖ్యంగా యువతలో డ్రగ్స్ పై అవగాహన కల్పించేందుకు భీమిలి పరిధిలో 60 డ్రగ్ అవగాహన ఫ్లెక్సీలు మరియు పోస్టర్లు ఏర్పాటు చేశారు.

**ఏర్పాటు చేసిన ప్రదేశాలు**

1. పాఠశాలలు , 2. కళాశాలలు, 3. బీచ్ ప్రాంతం, 4. లాడ్జీలు , 5. రిసార్ట్స్ 6. పబ్లిక్ పార్కులు

"డ్రగ్స్ వద్దు – జీవితం ముద్దు" అనే నినాదంతో ఈ ప్రచారం చేపట్టారు. డ్రగ్స్ విక్రయం, వినియోగం పై ఉక్కుపాదం మోపుతామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సి.ఐ తెలిపారు.ప్రజలు సహకరించాలని, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే 100 కి లేదా భీమిలి పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## అర్హులైన ప్రతి నేతన్నకూ 'నేతన్న సేవ' లబ్ధి అందాలి : ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఆదేశాలు





**యాడికి, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
నేతన్న సేవ' పథకం కింద ప్రభుత్వం అందించే ₹25,000 ఆర్థిక సాయం అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికీ అందేలా చర్యలు తీసుకోవాలని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి జౌళి శాఖ ఇన్చార్జి ఎడి బసవరాజు, ఏడీఓ శ్రీనివాసులను ఆదేశించారు. పలువురు నిజమైన చేనేత కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదనే విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే, తక్షణమే యాడికి వెళ్లి సమస్యను పరిష్కరించాలని సూచించారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంగళవారం యాడికి పంచాయతీ సమావేశ భవనంలో జౌళి శాఖ ఏడీ శ్రీనివాసులు చేనేత కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అర్హత ఉండి సాంకేతిక, ఇతర కారణాలతో లబ్ధి పొందని వారికి తప్పకుండా న్యాయం చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తూ.. అర్హులైన నిజమైన లబ్ధిదారులను త్వరితగతిన పునఃపరిశీలించి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గొర్తి రుద్రమ నాయుడు, రూపునేని రాజశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ మాయకుంట్ల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు...

# లోకకల్యాణార్థం, సమృద్ధిగా వర్షాలు కురవాలని 3 రోజులు ఇంద్రకీలాద్రిపై త్రయాహ్నిక "వరుణ యాగాలు, వరుణ జపాలు"

**విజయవాడ, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను నివారించి, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, నదులు, చెరువులు, జలాశయాలు నిండి రైతాంగం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ప్రత్యేక వైదిక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ,ఈవో శీనానాయక్ తెలిపారు.దేవాదాయ శాఖ కమీషనర్ ఉత్తర్వులు మేరకు ఈ నెల 14,15,16 తేదీలలో త్రయాహ్నిక దీక్షాపూర్వకంగా "వరుణ యాగములు, వరుణ జపములు" ఘటాభిషేకములు నిర్వహించనున్నట్లు సోమవారం ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు శుక్రవారంఉదయం 06:15 నుండి 08:30 వరకు (దుర్గాఘాట్ వద్ద): విఘ్నేశ్వర పూజ, వరుణ అనువాక సహిత కారక పారాయణలు.ఉదయం 09:00 నుండి (పాత యాగశాల వద్ద): విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, మండపారాధన, ప్రధాన దేవతలు, వరుణ, ఋష్య శృంగ, నవగ్రహ, అష్ట దిక్పాలకులకు పురుష సూక్త విధానాన పూర్వక పూజలు.సాయంత్రం 04:00 నుండి 06:00 వరకు: గణపతి, ఇంద్ర, వరుణ, ఋష్య శృంగ, మండప దేవతా ఆవాహనలు, మండప పూజ. రెండవ రోజు శనివారంఉదయం 06:30 నుండి 08:30 వరకు (దుర్గాఘాట్ వద్ద): వరుణ అనువాక కార్యక్రమము, మండప పూజ.ఉదయం 09:00 నుండి 11:00 వరకు (పాత యాగశాల వద్ద): రుద్రహోమం.సాయంత్రం: వివిధ హోమములు, మండప దేవతా హోమములు, విశేష పూజలు. మూడవ రోజు ఆదివారం ఉదయం 06:30 గంటలకు: దుర్గాఘాట్ నుండి పవిత్ర కృష్ణానదీ జల గ్రహణము.ఉదయం 07:00 గంటలకు: శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో మహాన్యాస పారాయణము. ఉదయం 07:30 గంటలకు: శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో "ఘటాభిషేకం" ప్రారంభం, శత అనువాహక, కారక పారాయణాలు, మండప దేవతా హోమాలు, జయాదులు.ఉదయం 10:30 గంటలకు: పాత యాగశాల వద్ద "మహా పూర్ణాహుతి" తో ఉత్సవ సమాప్తి. అవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో,సకాల వర్షాలు, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ దేవాదాయ శాఖ వారు ఈ కార్యక్రమం చేపడుతున్నారని ఈవో వివరించారు.

# ప్రజా సమస్యపై తక్షణ స్పంద. 24 గంటల్లోనే కుట్టు మిషన్ అందజేసిన P4 మార్గదర్శి బొండా సిద్దార్థ

**విజయవాడ, ఆగస్టు 11, నేటి శుభోదయ :** సెంట్రల్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు కొనసాగుతున్న "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా 29వ డివిజన్ నేతాజీ నగర్‌లో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్థానికంగా నివసిస్తున్న నిర్మల తన కుటుంబ జీవనోపాధి కోసం కుట్టు మిషన్ అవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు, ఆమె విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన ఉమా , తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్దార్థ కు విషయం తెలియజేసి, నిర్మల కు కుట్టు మిషన్ అందించాలని సూచించారు.ఎమ్మెల్యే సూచన మేరకు 24 గంటలు గడవకముందే బొండా సిద్దార్థ తన సొంత నిధులతో కుట్టు మిషన్‌ను నిర్మల కు అందజేశారు, దీంతో తన కుటుంబానికి జీవనోపాధి లభించడంతో నిర్మల ఆనందం వ్యక్తం చేస్తూ బొండా ఉమా, బొండా సిద్దార్థ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సిద్దార్థ మాట్లాడుతూ పేద కుటుంబాలకు అండగా నిలిచి, వారికి స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. గతంలో కూడా



ప్రమాదాలు, అనారోగ్యాలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు తన సొంత నిధులతో సహాయం చేయడంతో పాటు, కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు తదితర ఉపాధి సాధనాలను అందించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ సింగం వెంకన్న, మాజీ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, డివిజన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, అంగిరేకుల రాంబాబు, జనసేన నాయకులు లకనం శ్యాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# 102 ఉచిత సేవ తల్లీబిడ్డల ఆరోగ్యానికి భరోసా..

## నూతన తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాలు ప్రారంభించిన - ఎమ్మెల్యే బొండా ఉమా

**విజయవాడ, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి క్రిటికల్ కేర్ విభాగం వద్ద "తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్" నూతన వాహనాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఉమా తెలిపారు.తల్లులు, చిన్నారులకు అత్యవసర సమయాల్లో మెరుగైన, సురక్షితమైన రవాణా సౌకర్యం అందించేందుకు నూతన తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ప్రభుత్వం అందిస్తున్న సేవలను మరింత బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని,ప్రతి తల్లి, ప్రతి బిడ్డకు మెరుగైన వైద్య సేవలు అందేలా నిరంతరం కృషి చేస్తామని,గత ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ వైద్య వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టి, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నామని, ఆసుపత్రుల్లో మందులు, వైద్య పరీక్షలు, ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు.గర్భిణీలు, బాలింతల కోసం తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ సేవలను ఆధునిక సాంకేతికతతో మరింత బలోపేతం చేస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సాంకేతిక వ్యవస్థను అనుసంధానం చేస్తున్నామని ఉమా వివరించారు.అదేవిధంగా ప్రమాదాలు లేదా ఇతర కారణాలతో మృతి చెందిన పేదల మృతదేహాలను ఉచితంగా వారి ఇంటి వద్దకు చేర్చేందుకు మహాప్రస్థానం వాహనాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ అంబులెన్స్‌ల పేరుతో పేద కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ సేవలు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే మహిళలకు అవసరమైన కిట్లు, పౌష్టికాహారం, వైద్య సదుపాయాలు అందిస్తున్నామని, పేద కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం పడకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని తెలిపారు. 24 నెలల్లో



పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసిందని, రాబోయే రోజుల్లో కూడా అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని క్రిటికల్ కేర్ సెంటర్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి, పేదలకు అత్యాధునిక అత్యవసర వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు.పేద ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న ఉచిత, నాణ్యమైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, అవసరం లేకుండా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి భారీగా డబ్బులు ఖర్చు చేయవద్దని ఆయన సూచించారు.పేదల ప్రభుత్వం, పేదల పక్షపాతి చంద్రబాబు ప్రభుత్వం పేద కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం అని ఉమా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ. శ్రావణ బాబు, సూపరింటెండెంట్ రఘునందన్, ఆర్ ఎం ఓ ఝాన్సీ రాణి, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఇందుమతి దేవి, డిప్యూటీ సూపరింటెండెంట్, డాక్టర్ కేశవ చంద్ర, డి ఐ ఓ డాక్టర్ శరత్ బాబు, డిపి ఎం ఓ డాక్టర్ నవీన్, RBSK ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మాధవి నాయుడు, డాక్టర్ సునీల్ కుమార్, డిపిఓ మహేశ్వరరావు, నవనీతం సాంబశివరావు, ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ సోమనా అనిల్, మద్దినేని సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

# 15వ డివిజన్‌లో డ్రైనేజీ పనుల కోసం తవ్విన రోడ్డు

## - వెంటనే రోడ్డు నిర్మాణం చేయించిన ఎమ్మెల్యే గద్దె

**విజయవాడ, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వాటిని సాధ్యమైనంత వరకు పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.మంగళవారం ఉదయం తూర్పులోని 15వ డివిజన్‌లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన అక్కడి వారిని అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అనంతరం డివిజన్‌లో జరుగుతున్న టీడీపీ డోర్-టు-డోర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ హాయంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు.ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని కొంత మందికి డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం వల్ల ఇక్కడ ఉన్న సిమెంట్ రోడ్డును తవ్వి ట్రంక్‌లైన్‌ను ఏర్పాటు చేశారన్నారు. ట్రంక్ లైన్ అంటే వందల సంఖ్యలోని ఇళ్ళకు డ్రైనేజీ కనెక్షన్లను కలపవచ్చునని, నగరంలో ఎక్కడైనా డ్రైనేజీ సౌకర్యం కల్పించేందుకు రోడ్డును తవ్వుతారని, ఆరు నెలల వ్యవధి తర్వాత అధికారులు అక్కడ రోడ్డు నిర్మాణం చేస్తారని చెప్పారు. ఈ ప్రాంతంలోని ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆరు నెలల వ్యవధిలోపే ఇక్కడ తాత్కలికంగా రోడ్డును నిర్మాణం చేయాలని తాను మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించానని, వారు రేపు(బుధవారం) ఈ ప్రాంతంలో తాత్కలికంగా రోడ్డు నిర్మాణ పనులను



చేపడతారని ఎమ్మెల్యే చెప్పారు. ఈ ప్రాంతంలోని అందరికీ డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చిన తర్వాత శాశ్వతంగా రోడ్డు నిర్మాణం చేస్తారని అన్నారు. అప్పటి వరకు ప్రజలకు ఈ విషయాలను అర్థం చేసుకుని సహకరించాల్సిందిగా గద్దె కోరారు. ఈ కార్యక్రమంలోగాదిరెడ్డి అమ్ములు, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ,మూల్పూరి కళ్యాణి, సింగంశెట్టి రమేష్, రత్నం రమేష్, ముమ్మనేని ప్రసాద్, కట్టంపూడి శేషుబాబు, రాధాకృష్ణ, షర్టు శ్రీను, గోగుల యేసు, నిమ్మల హేమ, చిన్నం ఈశ్వరరావు, కొడాలి సోము, ముద్దునేని వంశీ, గల్లా రవి, గాదం ప్రసాద్, ఈఈ రామారావు, ఏఈ జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# 64వ డివిజన్‌లో రెండేళ్లలో సుమారు రూ.48 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం - బొండా రవితేజ



**విజయవాడ, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
64వ డివిజన్ కండ్రిక K3 అపార్ట్మెంట్స్ వెనుక నుండి నాలుగు స్తంభాల సెంటర్ వరకు రెండేళ్ల నమ్మకం – సంక్షేమం, అభివృద్ధి 'ఇంటింటికీ తెలుగుదేశం' ప్రచార కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా రవితేజ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను ఇంటింటికీ వెళ్లి తెలుసుకుని, సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని,64వ డివిజన్‌లో రెండేళ్లలో సుమారు రూ.48 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మసీదు నిర్మాణానికి సహాయం, తోపుడు బండ్లు, ఇస్త్రీ పెట్టెలు, కుట్టు మిషన్ల పంపిణీతో పాటు అవసరమైన వారికి స్వయం ఉపాధి కల్పించే కార్యక్రమాలను చేపట్టామని, డివిజన్‌లో ప్రధానంగా ఉన్న ఇళ్ల పట్టాల సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లామని, రానున్న రోజుల్లో ఇళ్ల పట్టాల పంపిణీతో పాటు కొత్త పెన్షన్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని రవితేజ తెలిపారు.అలాగే కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని బొండా అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన తల్లుల ఖాతాల్లో ఒక్కో విద్యార్థికి రూ.15,000 చొప్పున జమ చేసి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని తెలిపారు.పేదలకు కేవలం రూ.5 రూపాయల కు నాణ్యమైన భోజనం అందించే అన్న క్యాంటీన్లు, పెన్షన్ల పెంపు, తల్లికి వందనం వంటి సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తూ ప్రజల ప్రభుత్వం అనే నమ్మకాన్ని NDA కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని రవితేజ స్పష్టం చేశారు.ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకోవడం పరిష్కరించడం. సంక్షేమం, అభివృద్ధిని అందించడం ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో 64 వ డివిజన్ అధ్యక్షులు కాకొల్లు రవి కుమార్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సురవరపు నాగరాజు, ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ కార్యదర్శి పలగాని భాగ్యలక్ష్మి , మాజీ కార్పొరేటర్ సెంట్రల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పైడి తులసి, సెంట్రల్ నియోజకవర్గ అబ్జర్వర్ బచ్చుల బోస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి Sk బాబు, బ్యాంక్ చైర్మన్ శ్రీనాథ్ , బ్యాంకు డైరెక్టర్లు పొన్నం శేషగిరి , శంకర్ రెడ్డి ,యూనిట్ ఇన్చార్జి కోమరి రాజేష్, కే హర్ష సాయి, కే చరణ్, బూత్ కన్వీనర్, కంకణాల బాబు, కోరాడ రమణ,నల్లిపోగు కన్నా, సువర్ణ రాజు, సుందర్ రావు, రమణ,అడప సాయి,టిడిపి నాయకులు పొట్నూర్ అప్పల నాయుడు, పొట్నూరి సూర్యనారాయణ,వెంకట్, రమేష్, పండు, తిరుపతి రావు, మహిళా నాయకులు పుప్పాల భాను ,ఇప్పిళ్ళ నాగమణి పాల్గొన్నారు

# కళింగ వైశ్యల సమస్యలపై పోరాడాలి!

## - సౌత్ అధ్యక్షుడి నియామకంపై మాజీ ఎమ్మెల్యే వాసుపల్లిని సత్కరించిన కోమటి పెద్దలు

**విశాఖపట్నం, ఆగస్టు 12, నేటి శుభోదయ :**
12 కళింగ వైశ్యుల సమస్యలు వారి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాలని నూతనంగా ఎన్నికైన కళింగ వైశ్య బీసీ ప్రెసిడెంట్ పట్నాన రమణకి మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ సూచించారు. నూతనంగా ఎన్నికైన సందర్భంగా ఆసీలమెట్ట కార్యాలయంలో మంగళవారం వాసుపల్లి గణేష్ కుమార్ ను కోమటి పెద్దలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో అత్యధిక ప్రాధాన్యత ఉన్న కళింగ వైశ్యులు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలన్నారు. పాత పట్టణంలో కొలువై ఉన్న వాసవి మాత చల్లని ఆశీస్సులు జగన్మోహన్ రెడ్డి, ఆయన కుటుంబం పై ఉండాలని వాసుపల్లి ఆకాంక్షించారు. మళ్లీ పేదల ప్రభుత్వం రామరాజ్యం రావాలని, స్థానిక ఎన్నికల్లో మరింత బలోపేతం కావాలని అన్నారు. కోమటి పెద్దలు మాట్లాడుతూ ప్రజా సేవైనా పోరాటమైన వాసుపల్లి గణేష్ కుమార్ బ్రాండ్ అంబాసిడర్ అని వారు కొనియాడారు. వాసుపల్లి గణేష్ కుమార్ ఆదర్శంగా తీసుకుని జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో వైయస్సార్సీపి అధికారంలో తీసుకురావడమే లక్ష్యంగా కళింగ వైశ్య వర్గం అండగా ఉంటుందని వెల్లడించారు. వాసుపల్లి గణేష్ కుమార్ అందించిన సహకారంతో వైయస్సార్సీపి అధిష్టానం



అందించిన కలింగవైశ్య బీసీ ప్రెసిడెంట్ గా నియమించినందుకు పట్నాన రమణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 39వ వార్డ్ ప్రెసిడెంట్ ముజీబ్ ఖాన్,జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ళ రామరాజు,జిల్లా ఆర్ టీ ఐ జనరల్ సెక్రటరీ ఆరుగుల రాజు,జిల్లా బీసీ జనరల్ సెక్రటరీ చోడిపిల్లి శివ,జిల్లా బూత్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ గంగిరి ధనరాజు,సౌత్ స్టూడెంట్ ప్రెసిడెంట్ వి టీ కృష్ణ, 39వ వార్డ్ జనరల్ సెక్రటరీ వెంకటి,రామోలు సత్య 39వ వార్డ్ యూత్ ప్రెసిడెంట్ మైలిపిల్లి ఆది నారాయణా, 39వ వార్డ్ స్టూడెంట్ ప్రెసిడెంట్ మైలిపిల్లి కాసుబాబు , ఇబ్రహీం , కళింగ కోమటి నాయకులు జామి రవికుమార్,ఇప్పిలి గణేష్,పొట్నూరు జగదీశ్వరరావు,గుడ్ల వెంకటరమణ, పట్నాన మల్లేశ్వరరావు, కిల్లం శెట్టి కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నేర నివారణపై అవగాహన కార్యక్రమం - అరబిందో స్కూల్

**విశాఖపట్నం, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
11 విశాఖ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, డీసీపీ మేడం, ఏడీసీపీ మేడం మరియు ఏసీపీ సార్ వారి పర్యవేక్షణలో, సౌత్ క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీ జి.డి. బాబు ఆధర్యంలో, సిబ్బంది రాంబాబు మరియు శ్రీ రామకృష్ణ కలిసి మంగళవారం మధ్యాహ్నం స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరబిందో స్కూల్ నందు విద్యార్థులు, విద్యార్థినులు మరియు ఉపాధ్యాయులకు దొంగతనాల నివారణ మరియు ముందస్తు నేర నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ జి.డి. బాబు విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులకు క్రింది అంశాలపై అవగాహన కల్పించారు:

1. ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు మరియు అధిక మొత్తంలో నగదు ఉంచకుండా, వీలైనంత వరకు బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు.

2. ద్విచక్ర వాహనాలను పార్క్ చేసే సమయంలో తప్పనిసరిగా హ్యాండ్ లాక్/వీల్ లాక్ ఉపయోగించాలని, వాహనాలను సురక్షితమైన ప్రదేశాల్లోనే పార్క్ చేయాలని సూచించారు.

3. ఆటోలు, లారీలు మరియు ఇతర వాహనాల బ్యాటరీల దొంగతనాలను నివారించేందుకు వాహనాలను సురక్షితంగా ఉంచుకోవడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

4. బ్యాంకులు, ఏటీఎంలు, మార్కెట్లు, బస్టాండ్లు మరియు రద్దీ ప్రాంతాల్లో జేబుదొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా బస్సు ఎక్కేటప్పుడు మరియు దిగేటప్పుడు మొబైల్ ఫోన్లు, పర్సులు, విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

5. అపరిచిత వ్యక్తుల కదలికలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలియజేశారు.

6. పోలీసులు సూచించే ముందస్తు నేర నివారణ చర్యలను ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు మరియు తమ పరిసర ప్రాంతంలోని ప్రజలకు తెలియజేసి, అందరూ అప్రమత్తంగా ఉండేలా సహకరించాలని ఇన్స్పెక్టర్ శ్రీ జి.డి. బాబు విద్యార్థులకు సూచించారు.

దొంగతనాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నేరాలను గణనీయంగా నివారించవచ్చని, ప్రజలు మరియు పోలీసులు సమన్వయంతో పనిచేసినప్పుడే సురక్షితమైన సమాజాన్ని నిర్మించగలమని ఈ సందర్భంగా వివరించడం జరిగింది.





# ఏపీ వ్యాప్తంగా నేటి నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మె...



**విశాఖపట్నం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** ఏపీలో స్టైపెండ్ పెంపుపై అధికారులతో జరిపిన చర్చలు విఫలమవడంతో ఏపీ రాష్ట్ర జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జూడా) నేటి నుంచి సమ్మెకు పిలుపునిచ్చింది.తొలిదశలో ఇంటర్న్ లు పీజీలు, సీనియర్ రెసిడెంట్లు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అత్యవసరం కాని వైద్య సేవలను బంద్ చేయనున్నారు.ఈ నెల 15లోగా ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే 17న ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని జూడా హెచ్చరించింది.

# దేశంలోనే తొలి ఏఐ వర్సిటీ ఏర్పాటుకు సన్నాహాలు..




**విశాఖపట్నం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏ ఐ విశ్వవిద్యాలయం స్థాపనకు కర్ణాటక ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాబోయే శీతాకాల సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టనుంది. విద్యాసంస్థలు, పరిశ్రమల భాగస్వామ్యంతో ఏఐ విద్య, పరిశోధనలపై దృష్టి సారించనుంది. స్టార్టప్లు, పరిశోధకుల కోసం ప్రత్యేక ఏఐ హబ్ ను కూడా ఏర్పాటు చేయనుంది.

# కేంద్ర మంత్రివర్గ విస్తరణపై జోరుగా ప్రచారం, కొత్త మంత్రులెవరో?



**విశాఖపట్నం, ఆగస్టు 11, నేటి శుభోదయ :** 11 పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 13తో ముగియనున్న నేపథ్యంలో, కేంద్ర మంత్రివర్గ విస్తరణపై హస్తినలో జోరుగా ప్రచారం జరుగుతోంది. పలువురు మంత్రుల వద్ద అదనపు బాధ్యతలు, పనితీరు ఆధారంగా కొందరిని తప్పించి, మరికొందరిని చేర్చే యోచనలో మోడీ ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. బీహార్ మాజీ సీఎం నితీష్ కుమార్, తృణమూల్, శివసేన, ఆప్ నుంచి వచ్చిన ఎంపీలకు చోటు దక్కే అవకాశం ఉంది. వచ్చే ఏడాది రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, సామాజిక వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ విస్తరణ ఉంటుందని అంటున్నారు.

# ఆడబిడ్డల ప్రాణాలంటే మీకంత చులకనా చంద్రబాబూ..?

- **రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజా పాలనా.. లేక రాక్షస రాజ్యమా?**
- **మద్యం ఆదాయంపై ఉన్న శ్రద్ధ, మహిళల ప్రాణాల మీద లేదా?**
- **ప్రియాంక, హసీనా, పసిబిడ్డ జ్ఞానేశ్వరి.. ఇంకెంతమందిని బలితీసుకుంటారు?**
- **గంజాయి, డ్రగ్స్ మత్తులో కిడ్నాప్‌లు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా నిద్రపోతున్న ప్రభుత్వం**
- **ఆడబిడ్డలకు రక్షణ కల్పించలేని ముఖ్యమంత్రికి ఆ కుర్చీలో కూర్చునే అర్హత లేదు**



**విశాఖపట్నం, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
11 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా? లేక చచ్చిపోయిందా? ఆడబిడ్డలు ఇంటి గడప దాటితే ప్రాణాలతో తిరిగి వస్తారో లేదో తెలియని భయానక, దుర్మార్గపు పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి. రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజా పాలన కాదు, కసాయి ఖానా అని భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు, మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఒక ఘాటైన బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా ఏరులై పారుతున్నాయని, మత్తులో మృగాలుగా మారి అకృత్యాలకు పాల్పడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వానికి మద్యం ద్వారా వచ్చే ఆదాయం మీద, ఖజానా నింపుకోవడం మీద ఉన్న శ్రద్ధ.. ఆడబిడ్డల మానప్రాణాల మీద లేకపోవడం అత్యంత సిగ్గుచేటని దుయ్యబట్టారు.రాజమండ్రిలో మెడికల్ విద్యార్థిని ప్రియాంకను మృగాలు కారుతో గుద్ది కిరాతకంగా చంపేస్తే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని రామచంద్రయాదవ్ మండిపడ్డారు. చిలకలూరిపేటలో బీటెక్ చదువుతున్న ముస్లిం బిడ్డ షేక్ హసీనా ఆధారాలు లేకుండా చెట్ల పొదల్లో దహనమైన సంఘటన చూస్తుంటే రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఉందా? లేక గాఢ నిద్రలో ఉందా? అని ప్రశ్నించారు. ఇంతటి అమానుష కాండ జరిగినా ముఖ్యమంత్రికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దారుణమన్నారు.మరోవైపు పసిబిడ్డ జ్ఞానేశ్వరి అదృశ్యమై రెండు నెలలు గడుస్తున్నా.. ఆ చిన్నారి ఏమైందో ఏ కిడ్నాపర్ల చేతిలో చిక్కుకుందో కనీస ఆచూకీ కనిపెట్టలేని చేతకానితనంలో పోలీసు యంత్రాంగం ఉందన్నారు. కొద్ది రోజులు గాలించి వదిలేశారన్నారు. రాష్ట్రంలో కిడ్నాప్‌లు, అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యంగా మారుతున్నా, దున్నపోతు మీద వాన పడినట్లు ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.ఆడబిడ్డల ప్రాణాలకు, మాన ప్రాణాలకు రక్షణ కల్పించడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం అని, అది చేతకానప్పుడు ముఖ్యమంత్రికి ఆ కుర్చీలో కూర్చునే నైతిక అర్హత లేదని రామచంద్రయాదవ్ తేల్చిచెప్పారు. తక్షణమే ప్రియాంక, షేక్ హసీనా మరణాలకు కారణమైన కిరాతకులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని, చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ తక్షణమే కనిపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ మాఫియాను ఉక్కుపాదంతో అణచివేయకపోతే.. భారత చైతన్య యువజన (బీసీ వై ) పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

# డిజైర్ సొసైటీ పిల్లలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేసిన బాజపా నాయకులు కే,ఎన్,ఆర్

**విశాఖపట్నం, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
గాజువాక అఫీషియల్ కోలనీ డిజైర్ సొసైటీ లో రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పుట్టినరోజు సందర్భంగా పిల్లల మధ్య కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పౌష్టికాహారం కిట్లను బిజేపి గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు సౌజన్యంతో పంపిణీ చేశారు. పిల్లలకు చాక్లెట్లు బిస్కెట్ల ప్యాకెట్లు బగ్గు ఈశ్వరరావు సౌజన్యంతో పంపిణీ చేసారు. ఈ సందర్భంగా బాజపా బలోపేతం కోసం పివిఎన్ మాధవ్ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బాజపా నాయకులు ముసలయ్య ,జగదీష్ ,కేవి రమణ ,శ్రీనివాస్ , శ్రీను ,డిజైర్ సొసైటీ మేనేజర్ లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.



# శ్రావణ మాసం.. మంచి ముహూర్తాలు ఎప్పుడంటే ?

**విశాఖపట్నం, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
శుభకార్యాలకు నెల వైన శ్రావణ మాసం రాబోతోంది. ఈ ఏడాదిలో ఆగస్టు 13 నుండి సెప్టెంబర్ 11 వరకు శ్రావణం కొనసాగుతుంది. ఈ నెలలో మంచి ముహూర్తాలు భారీగానే ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. ఈ నెలలో 16, 17, 20, 21, 22, 23, 26, 27, 28, 29, 30 తేదీ వరకు, సెప్టెంబరులో 3, 4, 5, 8, 10, 11, 13, 14 తేదీలలో అన్ని శుభ ముహూర్తాలేనని అంటున్నారు. దీంతో పెళ్లిళ్లు, నిశ్చితార్థాలు, గృహ ప్రవేశాలు పెద్ద ఎత్తున జరగనున్నాయి. ఈ సీజన్‌లో దాదాపు 10వేలకు పైగా పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా.



# 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్ కొండ వాలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గణబాబు పర్యటన

**విశాఖపట్నం, ఆగస్టు 11, నేటి శుభోదయ :**
11 విశాఖ పశ్చిమ నియోజకవర్గం 90వ వార్డు పరిధిలోని లక్ష్మీ నగర్ ఎఫ్–బ్లాక్ కొండవాలు ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గణబాబు పార్టీ శ్రేణులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కొండవాలు ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ నేరుగా వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ, కూటమి ప్రభుత్వ ప్రగతి నివేదికను అందజేశారు.బాధితులకు సీఎంఆర్ఎఫ్ (సీఎం ఆర్ ఎఫ్ ) చెక్కు అందజేత:ఈ పర్యటన మధ్యలోనే వైద్య సహాయం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ ఎఫ్ ) నుండి మంజూరైన ఆర్థిక సహాయక చెక్కును ఎమ్మెల్యే గణబాబు లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు:లక్ష్మీనగర్ కు చెందిన కోనాల దివ్యా దీవెన వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన ₹1,13,126 ఆర్థిక సహాయ చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ... కొండవాలు ప్రాంతాల్లోని మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తామని, ఆపదలో ఉన్న ప్రతి పేద కుటుంబానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కొండంత అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో 90వ వార్డు మాజీ కార్పొరేటర్ బొమ్మిది రమణ, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి అపర్ణ ప్రసాద్, వార్డు అధ్యక్షులు అరుణ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .